# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 16-09-2017**

దేవాలయాల్లో పనిచేసే అర్చకులు, ఉద్యోగులకు వచ్చే నవంబర్ నుంచి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే పే స్కేల్ అమలు చేస్తామని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 1805 దేవాలయాల్లో అమలవుతున్న దూపదీప నైవేద్యం పథకాన్ని అదనంగా మరో 3 వేల దేవాలయాలకు వర్తింపచేస్తామని ప్రకటించారు. దేవాలయాల నిర్వహణ సంబంధమైన అంశాలను పర్యవేక్షించడానికి కొత్తగా ధార్మిక పరిషత్ ను ఏర్పాటు చేసినట్లు సీఎం వెల్లడించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన అర్చకులతో ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం ప్రగతి భవన్ లో సమావేశమయ్యారు. మంత్రులు శ్రీ ఇంద్రకరణ్ రెడ్డి, శ్రీ టి. హరీష్ రావు, శ్రీ తలసాని శ్రీనివాస యాదవ్, శ్రీ తుమ్మల నాగేశ్వర్ రావు, శ్రీ నాయిని నర్సింహరెడ్డి, శ్రీ జూపల్లి కృష్ణారావు, రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ శ్రీ లక్ష్మి కాంతరావు, ప్రభుత్వ సలహాదారు శ్రీ కెవి. రమణాచారి, ఎమ్మెల్సీలు శ్రీ పురాణం సతీష్, శ్రీ కర్నె ప్రభాకర్, శ్రీ శ్రీనివాస రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీ శివశంకర్, జాయింట్ కమిషనర్ శ్రీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. పై మూడు నిర్ణయాలకు సంబంధించిన జీవోలను బ్రాహ్మణ సంఘం నాయకులకు, అర్చకులకు ముఖ్యమంత్రి ఈ సమావేశంలోనే అందించారు.

"స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశ వ్యాప్తంగా దేవాలయాల మీద అతి ఎక్కువ అరాచకం జరిగింది. ప్రభుత్వాలు ఏ దేవాలయానికి ఒక్క ఎకరా భూమి కూడా ఇవ్వలేదు. దేవాలయాల భూములు అన్యాక్రాంతమైనా, కబ్జాలకు గురైనా నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. సమైఖ్య పాలనలో తెలంగాణ ప్రాంతంలో ఈ అన్యాయం మరింత ఎక్కువగా జరిగింది. మన గుళ్లను గుళ్లుగా చూడలేదు. మన పుష్కరాలను పుష్కరాలుగా చూడలేదు. మన బతుకును బతుకుగా చూడలేదు. దేవాలయాల అభివృద్ధిని పట్టించుకున్న పాపాన పోలేదు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత దేవాలయాల అభివృద్ధి పైనా, అర్చకుల సమస్యలపైనా, బ్రాహ్మణుల సంక్షేమం పైనా ప్రత్యేక దృష్టి పెట్టాము. ఒక్కొక్క పని చేసుకుంటూ వస్తున్నాము. యాదాద్రి, దర్మపురి, వేములవాడ, భద్రాద్రి తదితర ఆలయాలను ఒక పద్ధతి ప్రకారం అభివృద్ధి చేస్తున్నాము. గతంలో కేవలం 1805 దేవాలయాలకు నెలకు రూ.2500 మాత్రమే దూపదీప నైవేద్యం క్రింద ఇచ్చేవారు. దాన్ని తెలంగాణ ప్రభుత్వం రూ. 6 వేలకు పెంచింది. దూపదీప నైవేద్యం క్రింద ఇప్పటినుండి మరో 3 వేల ఆలయాలకు నెలకు రూ. 6 వేల చొప్పున ఇస్తాం. దీంతో రాష్ట్రంలోని మొత్తం 4805 దేవాలయాలకు దూపదీప నైవేద్యం పథకం వర్తిస్తుంది" అని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు.

“అర్చకులకు గౌరవ మర్యాదలు బాగానే లబించినా పూట గడవడమే కష్టంగా ఉంది. గుడిలో పూజలు చేసే అర్చకులకు పిల్లను కూడా ఇవ్వడానికి వెనకాడడంతో పెళ్లిల్లు కాని దుస్థితిలో ఉన్నారు. వారి జీత భత్యాలు ఆలయ కమిటీల మీదనో మరెవరి దయాదాక్షిణ్యాల మీదనో ఆదారపడి ఉంది. ఇప్పటినుండి ఈ పరిస్థితిలో మార్పు వస్తుంది. ఇకపై ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే అర్చకులు, ఇతర దేవాలయ ఉద్యోగులకు మొత్తం 5625 మందికి ప్రతీ నెల ఒకటో తేదీన జీతాలు అందుతాయి. ఉద్యోగుల స్థాయిని బట్టి ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా వేతనాలు చెల్లిస్తారు. నవంబర్ నెల నుంచి పే స్కేల్ అమలు చేస్తాము. ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్సీ అమలు చేసినప్పుడు దేవాలయాల ఉద్యోగుల జీతాలు కూడా సవరిస్తాము” అని ముఖ్యమంత్రి అర్చకుల హర్షద్వానాల మధ్య ప్రకటించారు.

“దేవాలయాలపై ప్రభుత్వం పెత్తనం చేసే దుస్థితి పోవాలి. అందుకే ప్రభుత్వ పెత్తనాన్ని తగ్గించడానికి ఇకపై దేవాలయాల నిర్వహణ, తదితర వ్యవహారాలన్నీ పర్యవేక్షించడానికి కొత్తగా ధార్మిక పరిషత్ ఏర్పాటు చేస్తున్నాం. ఈ పరిషత్ ఆధ్వర్యంలోనే ఇకపై దేవాలయాల నిర్వహణ ఉంటుంది. ఇప్పటికే బ్రాహ్మణుల సంక్షేమం కోసం వంద కోట్ల రూపాయల నిధులతో ప్రత్యేక బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఏర్పాటు చేశాము. దీని ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాము. అర్చకులు, బ్రాహ్మణులకున్న ఇబ్బందులు, సమస్యలను పరిషత్ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలి” అని ముఖ్యమంత్రి కోరారు.

“దేవాలయాల భూములు కూడా అన్యాక్రాంతమయ్యాయి. ఇప్పుడు రాష్ట్రంలో 83వేల ఎకరాల భూములు దేవాలయాల ఆధ్వర్యంలో ఉన్నట్లు లెక్క ఉంది. ఈ భూమిని రక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. అర్చకులు కూడా దేవాలయాల నిర్వహణ, దైవ సంబంధ కార్యక్రమాలపై మరింత ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలి. పొరపాట్లు కాకుండా చూడాలి. అర్చన బాగా చేస్తే భగవంతుడు కూడా మనల్ని దీవిస్తారు. ఉద్యమ సమయంలో మీరంతా బాగా పూజలు చేసి, ప్రత్యేక రాష్ట్రం రావాలని కోరుకున్నారు. నేను ఏ గుడికి వెళ్లినా మనో వాంఛ ఫలసిద్ధిరస్తు, తెలంగాణ ప్రాప్తిరస్తు అని దీవించేవారు. దేవుడు అనుగ్రహించారు. మీ దీవెనలు ఫలించాయి. తెలంగాణ రాష్ట్రం వచ్చింది. ఇప్పుడు కూడా దేవాలయాల అభివృద్ధి, అర్చకుల సంక్షేమం, బ్రాహ్మణుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటున్నాం. ధార్మిక పరిషత్ ను మరింత విస్తృత పరుస్తాం. శృంగేరి పీఠాధిపతులు, చిన జీయర్ స్వామి, కంచి పీఠాధిపతుల సలహాలు, సూచనలు పాటించి ధార్మిక పరిషత్ కార్యక్రమాలను రూపొందిస్తాం. అర్చకుల సమస్యలు పరిష్కరించడంతో పాటు ఇతర ముఖ్య నిర్ణయాలు తీసుకున్న ఈ సమయంలో నాకు 15 లడ్డూలు తిన్నంత ఆనందంగా ఉంది” అని ముఖ్యమంత్రి అన్నారు.

సిపిఆర్ఓ టు సిఎం